# సాక్షి అనంతపురం

గురువారం । 18 । జూలై । 2024






## టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, ప్రకారం విక్రయాలు జరిగాయి



## టమాట కిలో రూ.62

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.62, కనిష్టంగా రూ.44, సరాసరిన రూ.54 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి

గరిష్టం/కనిష్టం

35.6°/ 23.4°

జిల్లా అంతటా బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### సిగ్నళ్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



సౌత్ క్యాబిన్‌లో సిగ్నల్ పాయింట్ల పని తీరును తెలుసుకుంటున్న డీఆర్‌ఎం

**గుంతకల్లు:** సిగ్నళ్లు, పాయింట్ల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ అన్నారు. గుంతకల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని సౌత్ సిగ్నల్ క్యాబిన్ తోపాటు గుంతకల్లు–గుత్తి రైలు మార్గాన్ని అధికారులతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. సౌత్ క్యాబిన్‌లో సిగ్నళ్లపై సిబ్బందికి ఏ మేరకు అవగాహన ఉందో పరీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ సిగ్నల్ పాయింట్ల నిర్వహణలో లోపాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లోటు పాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సమర్థవంతం గా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం గుంతకల్లు–గుత్తి రైలు మార్గం తనిఖీ చేశారు.

### మొహర్రం వేడుకల్లో అపశ్రుతి



తీవ్రంగా గాయపడిన ఆదినారాయణ

**ఉరవకొండ:** మొహర్రం వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. పీర్ల స్వాముల వెంట అగ్నిగుండం దాటేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి అందులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఉరవకొండ మండల పరిధిలోని చిన్న కౌకుంట్ల గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వామి వారి అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఈ సందర్భంగా పీర్ల స్వాముల అగ్నిగుండ ప్రవేశం జరుగుతుండగా.. పీర్ల వెనుకే అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ అగ్నిగుండం లోకి దిగాడు. అయితే కాలు జారి గుండంలో పడిపోయాడు. గమనించిన భక్తులు ఆదినారాయణను బయటకు తీశారు. కానీ అప్పటికే అతను 90 శాతం కాలిపోయాడు. బంధువులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. ప్రస్తుతం ఆదినారాయణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# చూసిన కనులదే భాగ్యము



కుళ్లాయిస్వామి గ్రామోత్సవం



పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కిక్కిరిసిన భక్తజనం.. మార్మోగిన గోవింద నామం వెరసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాలు బుధవారం కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామి నడిచే అగ్ని గుండంలో నిప్పులను చదును చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు హుసేనప్ప స్వామి వార్లకు చెక్కెర చదివింపులతో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సన్నాయి వాయిద్యాల మధ్య, కొబ్బరి దివిటీల వెలుగులో కొండారెడ్డి వంశస్తులు కుళ్లాయిస్వామి పీరుతో సహా తక్కిన పీర్లను ఎత్తుకొని అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం స్వామి వార్లను ఎత్తుకొని గ్రామ ప్రధాన వీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న దిగుడుబావి వద్దకు పీర్లను తీసుకెళ్లి జలధి పూర్తి చేశారు. కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గూగూడు కిటకిటలాడింది. కుళ్లాయిస్వామి చివరి దర్శనం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు.

– నార్పల/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కుళ్లాయిస్వామి అగ్నిగుండం ప్రవేశాన్ని తిలకిస్తున్న భక్తజనం

# సిండికేటుగాడు.. మేపాడు!

**పచ్చ నేతా.. మజాకా..**

- రైల్వే అధికారులకు లంచాల కేసులో టీడీపీ నేత చల్లా సురేష్‌నాయుడు బాగోతం
- ముడుపులతో పాటు బంగారు బిస్కెట్లు, విలాస టూర్లతో ఎర వేసేవాడని వెల్లడి
- కాంట్రాక్టు పనులు తూతూమంత్రంగా చేపట్టినట్లు గుర్తింపు
- సిండికేట్‌గా మారి కాంట్రాక్టులు దక్కించుకున్న వైనం
- ముక్కున వేలేసుకుంటున్న సీబీఐ అధికారులు





చల్లా సురేష్ నాయుడు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** తీగలాగితే డొంకంతా కదిలింది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో జరిగిన ముడుపుల బాగోతంలో టీడీపీ నేత సురేష్ నాయుడు ముఖ్య పాత్ర పోషించినట్టు తేలింది. రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య జరిగిన కోట్లాది రూపాయల లావాదేవీల్లో ముందునుంచి సురేష్ నాయుడు కీలకంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. కాంట్రాక్టర్లను సిండికేట్ చేసి ఎక్కువ రేటుకు వేసుకోవడంలో అధికారులకు, సురేష్ నాయుడుకు జరిగిన లావాదేవీలు కూడా గుర్తించారు. దీంతో చల్లా సురేష్‌నాయుడుపై సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచిన వివరాలిలా..**

గుంతకల్లు నియోజకవర్గంలోని జి.కొట్టాలకు చెందిన సురేష్‌నాయుడు 15 సంవత్సరాలుగా రైల్వే కాంట్రాక్టులు చేస్తున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కాంట్రాక్టులు దక్కించుకునేందుకు డివిజన్ పరిధిలోని అధికారులకు ముడుపుల ఎర చూపేవారు. లంచాలిచ్చి దక్కించుకున్న కాంట్రాక్టులను నాసిరకంగా చేపట్టేవారు. సురేష్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో పనులు చేసిన ఆయన.. బంగారు బిస్కెట్లు కూడా రైల్వే అధికారులకు పలు మార్లు ఇచ్చారు. వివిధ కాంట్రాక్టులు చేపట్టి అవార్డు అయిన పనులకు బిల్లులు త్వరితగతిన ప్రాసెసింగ్ చేయడంలో అధికారులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు అధికారులకు ఇచ్చి టెండర్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అప్పటి సీనియర్ డివిజన్ ఫైనాన్స్ మేనేజర్ కుందా ప్రదీప్ బాబు, డీఆర్‌ఎం వినీత్‌సింగ్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ అక్కిరెడ్డి, బీఎల్‌వీ ప్రసాద్, ఎం.బాలాజీ తదితరులకు భారీగా డబ్బు ముట్టచెప్పారు. డీఆర్‌ఎం ఎక్కడికైనా కుటుంబంతో పర్యటనలకు వెళితే సురేష్‌నాయుడు, కుప్పం రమేష్‌కుమార్‌రెడ్డి వాహనాలు, ఇతర సౌకర్యాలను కల్పించేవారని తేలింది. ఒకే దఫా రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను డీఆర్‌ఎం వినీత్‌సింగ్‌కు ఇచ్చినట్లు గుర్తించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ అధికారులకు రాష్ట్రంలో సాధారణ ఎన్నికల తర్వాత నగదు రూపంలో అందజేయాల్సిన వివరాల గురించి కూడా చర్చించుకున్నారు. సురేష్ నాయుడుతో పాటు సీఎస్‌ఆర్ ప్రాజెక్ట్స్ అధినేత కుప్పం రమేష్ కుమార్‌రెడ్డి, శక్తి ఇంజినీరింగ్‌కు చెందిన రామసుబ్బారెడ్డి, ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ బి.శివారెడ్డి కూడా ఉన్నట్టు అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

**ముక్కున వేలేసుకుంటున్న అధికారులు..**

చల్లా సురేష్ నాయుడు, బీమాశంకర్‌లతో అప్పటి డివిజనల్ రైల్వే మేనేజర్ డబ్బు వ్యవహారాలు మాట్లాడుతున్న రికార్డులను కూడా సీబీఐ అధికారులు పరిశీలించారు. కొంతమంది కింది స్థాయి ఉద్యోగులకు చల్లా సురేష్‌నాయుడు డబ్బులు ఇస్తానని చెప్పి ఇప్పటికీ చెల్లించలేదని ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. 2024 మే 22న చల్లా సురేష్‌నాయుడు నగదు మొత్తాన్ని అధికారులకు చేర్చాలని బీమాశంకర్ అనే వ్యక్తికి చెప్పారని పేర్కొన్నారు. సురేష్‌నాయుడు లంచాల వ్యవహారం చూసి సీబీఐ అధికారులే ముక్కున వేలేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికీ కాంట్రాక్టర్లు, రైల్వే అధికారుల మధ్య జరిగిన లంచాల వ్యవహారంపై డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతూనే ఉంది.

### వైభవంగా ఏకాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

**ప్రశాంతి నిలయం:** ఏకాదశి వేడుకలు ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇందులో భాగంగానే సత్యసాయి మహా సమాధి, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత వేదపఠనంతో ఏకాదశి వేడుకలు ప్రారంభమయ్యాయి. దిండి నుంచి తీసుకొచ్చిన పల్లకీని ఊరేగిపుంగా సత్యసాయి మహాసమాధి చెంతకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిగీతాలతో ముంబైకి చెందిన బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన నాటిక అందరినీ అలరించింది.



చిన్నికృష్ణయ్యను కీర్తిస్తూ సాగుతున్న నృత్యరూపకం

# ముందుచూపు.. మేలిమలుపు




- జీజీహెచ్‌లో అత్యాధునికంగా ఆప్తమాలజీ విభాగం
- గత ప్రభుత్వంలో కొనుగోలు చేసిన పరికరాలు అందుబాటులోకి..
- రూ.కోటి విలువ చేసే పరికరాలతో రెటీనా క్లినిక్ ఏర్పాటు
- పేదలకు మరింత మెరుగైన వైద్యం

**అనంతపురం మెడికల్:** సర్వజనాస్పత్రిలోని ఆప్తమాలజీ విభాగం కొంగొత్తగా రూపుదిద్దుకుంది. అత్యాధునిక వైద్య పరికరాలు అక్కరకొచ్చాయి. విభాగంలో రోజూ ఓపీ 100 నుంచి 130 వరకూ ఉంటోంది. ప్రతి నెలా 70 నుంచి 85 సర్జరీలు జరుగుతున్నాయి. రోగులకు నిత్యం ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలందిస్తున్నారు.

**పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసింది. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందేలా చూసింది. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా ఆస్పత్రుల్లో వసతులు సమకూర్చింది. ఇందులో భాగంగా సర్వజనాస్పత్రిలోని ఆప్తమాలజీ విభాగానికి రూ. కోటి విలువ చేసే పరికరాలు అందించింది. అప్పట్లో 'వైఎస్సార్ ఆరోగ్య శ్రీ' పథకం ద్వారా కొనుగోలు చేసిన పరికరాలతో నేడు కంటి ఓపీ విభాగంలో ప్రత్యేకంగా రెటీనా క్లినిక్ ఏర్పాటు చేశారు.

**కంటి విభాగం వైద్యుల పెద్దమనసు..**

రోగుల కోసం గత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వైద్యులు, సిబ్బంది కూడా తమ వంతు తోడ్పాటు అందించారు. ఆరోగ్య శ్రీ ద్వారా జరిగే ఆపరేషన్లలో పాలుపంచుకునే వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం ప్రోత్సాహకం రూపంలో నగదు అందిస్తుంది. అలా అందిన డబ్బును కంటి విభాగంలో ఏర్పాటు చేసిన గ్రీన్ లేజర్‌కు లెన్స్ కొనేందుకు, రెటీనా క్లినిక్‌లో రంగులు వేయడానికి వెచ్చించి సిబ్బంది తమ పెద్దమనసు చాటుకున్నారు.

**యాగ్ లేజర్**



ధర రూ.12 లక్షలు. కంటి శుక్లాల ఆపరేషన్ చేసిన తర్వాత కూడా కంటిపై పొర వచ్చే అవకాశం ఉంటుంది. అటువంటి వారికి ఈ పరికరం ద్వారా లేజర్ ట్రీట్‌మెంట్ అందిస్తారు. వీటితో పాటు రెండు షిట్ ల్యాంప్స్ పరికరాలు వచ్చాయి.

**పరికరాల వివరాలిలా..**

**బీ స్కాన్ మిషన్**



ప్రస్తుత మార్కెట్‌లో ఈ పరికరం ధర రూ.20 లక్షలు. కంటి శుక్లాలున్న వారిలో రెటీనా ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

**ఫండస్ కెమెరా**



ధర రూ.18 లక్షలు. కంటి సమస్యలతో వచ్చిన వారికి ఆపరేషన్ చేశాక, కంట్లో సమస్య తగ్గిందో లేదో చూడవచ్చు. అవసరమైతే తదుపరి చికిత్స అందించవచ్చు.

**గ్రీన్ లేజర్**



ధర రూ.47 లక్షలు. మధుమేహంతో బాధపడుతున్న వారిలో (డయాబెటిక్ రెటినోపతి) కంట్లో రక్తస్రావం, రెటీనా నరం తెగిపోవడం వంటి సమస్యలు వస్తాయి. అలాంటి సందర్భంలో మూడు సిట్టింగ్‌ల ద్వారా లేజర్ ట్రీట్‌మెంట్ ఇస్తారు. ప్రైవేటుగా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.12,000 నుంచి రూ.15,000 ఖర్చు అవుతుంది. గతంలో ఇటువంటి కేసులు వస్తే తిరుపతి, కర్నూలు ఆస్పత్రులకు పంపేవారు.

# ధర్మవరంలో దౌర్జన్యకాండ !

- అక్రమాలకు తెరలేపిన కూటమి నేత
- బెదిరింపులతో రూ.4.50 కోట్ల భూమిని కాజేసిన వైనం !

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే నాయకులు అవినీతి దందాకు తెరలేపారు. వాణిజ్య కేంద్రమైన ధర్మవరంలో కూటమి పార్టీకి చెందిన ఓ కీలక నేత వ్యవహార శైలి అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా తమ అనుమతి తప్పనిసరంటూ ఆయన హుకుం జారీ చేశారు. ఏకంగా దస్తావేజు లేఖరులను ఇంటికి పిలిపించుకుని తమ అనుమతి లేనిదే ఏ డాక్యుమెంట్ రాయకూడదంటూ అనుచరుల ద్వారా అల్టిమేటమిచ్చారు.

**నెలవారీ మామూళ్ల కోసమే...**

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నెలవారీ మామూళ్లు రాబట్టుకోవాలని కీలక నేత ప్లాన్ చేసినట్లు తెలిసింది. భూ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకోవాలన్నది ఆయన టార్గెట్. ఈ నేపథ్యంలో ధర్మవరం పట్టణంలో రియల్టర్లు, భూ యజమానులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. డాక్యుమెంట్లన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ రిజిస్టర్ చేసుకునే క్రయ, విక్రయదారులు సదరు నేత కార్యాలయానికి డాక్యుమెంట్ రైటర్ల ద్వారా సమాచారం ఇచ్చి ఆయన అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**అప్పనంగా రూ.4.5 కోట్ల భూమి**

ధర్మవరం మండల పరిధిలోని రేగాటిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 293, 294లలో హిందూపురానికి చెందిన వారికి 23 ఎకరాల భూమి ఉంది. ఇందులో భాగంగానే వారు భూమిలో కొంత భాగం ప్లాట్లు వేసి విక్రయించేలాగా, మరికొంత భాగం విల్లాలు కట్టి విక్రయించేలాగా లేఅవుట్ వేశారు. అనుకున్న ప్రకారం భూమిలో సగభాగంపైగా విక్రయాలు జరిపి విల్లాలను నిర్మిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్న మిగిలిన ప్లాట్లను విక్రయించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించగా సదరు నేత అంగీకరిస్తేనే రిజిస్టర్ చేస్తామని అధికారులు, దస్తావేజు లేఖరులు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. తమ భూములన్నీ సక్రమంగా ఉన్నాయని ఎందుకు రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని భూయజమానులు అడిగినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గత్యంతరం లేక సదరు నేత అనుచరులను భూ యజమానులు సంప్రదించగా లేఅవుట్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 65.73 సెంట్ల స్థలాన్ని తమ నాయకుడి పేరిట రాసివ్వాలని, అలా చేస్తే తాము అడ్డుచెప్పమని సమాధానం ఇచ్చారు. దీంతో చేసేదిలేక సదరు భూయజమానులు కూటమి నేత అనుచరుడికి రిజిస్టర్ చేయించినట్లుగా సమాచారం. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.4.50 కోట్లకు పైగానే ఉంది. కోట్ల రూపాయాలు పోగొట్టుకున్నామని సదరు భూయజమానులు ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిసింది.

# హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయండి

- టీబీ డ్యాం బోర్డుకు ఎస్‌ఈ రాజశేఖర్ లేఖ

**అనంతపురం సెంట్రల్:** హెచ్చెల్సీకి ఈనెల 21 నుంచి నీటిని విడుదల చేయాలని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోందన్నారు. ఇప్పటికే అత్యధికంగా 71,231 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైందన్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 40 టీఎంసీల వరకూ చేరుకుందని, డ్యాం త్వరితగతిన గరిష్ట మట్టానికి చేరుకునే అవకాశమున్న నేపథ్యంలో హైలెవల్ మెయిన్ కెనాల్ (హెచ్చెల్సీ)కి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ నెల 21 నుంచి 500 క్యూసెక్కుల చొప్పున ప్రారంభించి, ఆ తర్వాత క్రమంగా పెంచుకుంటూ పోవాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న బోర్డు అధికారులు ప్రధాన కాలువ పరిశీలిస్తారని, ఆ తర్వాత నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటారని ఎస్‌ఈ విలేకరులకు తెలియజేశారు. కర్ణాటకలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోందని, ఇది శుభపరిణామంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

**నిండుకుండలా టీబీ డ్యాం**

**బొమ్మనహాళ్:** తుంగభద్ర జలాశయం నిండుకుండలా మారింది. బుధవారం ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తడంతో ఇన్‌ఫ్లో 49,522 క్యూసెక్కులకు చేరింది. గురువారం ఉదయానికి 63 వేల క్యూసెక్కులకు చేరవచ్చని జలాశయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 39.718 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,611.07 అడుగులకు నీరు చేరాయి. అవుట్‌ఫ్లో 212 క్యూసెక్కులు నమోదవుతోంది.



నీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

## క్లుప్తంగా

### నార్పలలో వరుస చోరీలు

నార్పల: మండల కేంద్రంలో వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలలోని మసీదుకట్ట కాలనీకి ఓబయ్య మంగళవారం రాత్రి భోజనం చేసుకుని కుటుంబసభ్యులతో కలసి ఇంటిపైకి చేరుకుని నిద్రించాడు. విషయాన్ని గుర్తించిన దుండుగులు బుధవారం వేకువజామున ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని 20 తులాల బంగారు నగలు అపహరించారు. అనంతరం అదే కాలనీకి చెందిన గంధోడి నాగేంద్ర ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం విషయాన్ని గుర్తించిన బాధితుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ రాజశేఖరరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలంలోని ముప్పాలగుత్తిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబసభ్యులతో కలసి హైదరాబాద్‌లో నివాసముంటున్న వివాహిత సుమిత్ర (22) మొహర్రం సందర్భంగా గ్రామానికి వచ్చారు. బుధవారం కుటుంబసభ్యులందరూ మొహర్రం వేడుకల్లో నిమగ్నమై ఉండగా, ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సుమిత్ర ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, సుమిత్ర ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

### వ్యక్తి బలవన్మరణం


మృతుడు బషీర్

ఉరవకొండ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని లక్ష్మీనృసింహ స్వామి కాలనీలో నివాసముంటున్న బషీర్(51)కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. వెల్డింగ్ పనులతో జీవనం సాగించేవాడు. సరైన పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమయ్యేవారు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన బుధవారం కుటుంబసభ్యులు మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆయనను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బషీర్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


నరసయ్య (ఫైల్)

పెద్దవడుగూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన నరసయ్య (24), తన అన్న శంకర్‌తో కలసి ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి పెద్దవడుగూరుకు బయలుదేరాడు. మండల కేంద్రం సమీపంలోకి చేరుకుంటుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన నరసయ్య, శంకర్‌ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నరసయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ చిన్నరెడ్డప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# 'సెంట్రల్'లో కొత్త కోర్సులు

- ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ, పీజీలో 24 కోర్సుల అమలు
- తాజాగా పీహెచ్‌డీ కోర్సులకూ అనుమతి


సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో నూతన కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి సరికొత్త కోర్సులు అమలు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ కోర్సులకు సంబంధించి మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానం పాటిస్తున్నారు. దీంతో మేజర్, మైనర్ రెండు డిగ్రీలను ఏకకాలంలో తీసుకునే అవకాశం ఉంది. నూతన జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికను అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కేలా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. పీజీ విద్యార్థులకు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్న ఉద్దేశ్యంతో మానవ విలువలు, పర్యావరణం, భారత రాజ్యాంగం, సైబర్ సెక్యూరిటీ వంటి సబ్జెక్టులను నిర్బంధం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 20 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో యూజీ, పీజీ కోర్సుల్లోని 358 సీట్లకు గాను ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయి. 2018లో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ ఒక్కో అడుగు వేస్తూ శాశ్వత క్యాంపస్ వైపు పరుగులు తీస్తోంది. ఆగస్టు నుంచి జంతలూరులో శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహించనున్నారు.

**పీజీ కోర్సులు ఇవే:**

ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ పొలిటికల్ సైన్సెస్, ఎమ్మెస్సీ (అప్లైడ్ సైకాలజీ), ఎమ్మెస్సీ (ఎకనామిక్స్), ఎమ్మెస్సీ (మేథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్), ఎమ్మెస్సీ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డేటా సైన్సెస్), ఎమ్మెస్సీ (మాలుక్యులర్ బయాలజీ), ఎంబీఏ, ఎంకాం, ఎంఏ (గవర్నర్స్ అండ్ పబ్లిక్ పాలసీ), ఎంఏ (హిందీ), ఎమ్మెస్సీ (క్లినికల్ సైకాలజీ), ఎమ్మెస్సీ (కంప్యూటేషనల్ సోషల్ సైన్సెస్), ఎమ్మెస్సీ (ఎకానమిక్స్ అండ్ డేటా అనాలసిస్), ఎమ్మెస్సీ (జాగ్రఫీ అండ్ జియా ఇన్ఫర్మేటిక్స్), ఎమ్మెస్సీ ( స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ). ఇందులో 10 కోర్సులు కొత్తగా అందుబాటులోకి తెచ్చారు.

**యూజీ కోర్సులు ఇవే**

బీఏ (ఆనర్స్) పొలిటికల్ సైన్సెస్, బీఎస్సీ (ఆనర్స్) ఎకనామిక్స్, బీ.ఒకేషనల్ టీటీఎంను బీబీఎంగా కోర్సు పేరు మార్పు చేశారు. బీ.ఒకేషనల్ ఆర్ఎంఐటీను బీఎస్సీ ఆర్ఎంఐటీగా పేరు మార్పు చేశారు. బీకాం (ఆనర్స్), బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్, బీఎస్సీ (ఆనర్స్)సైకాలజీ, బీఎస్సీ(ఆనర్స్ కంప్యూటర్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీకాం (ఆనర్స్), బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్, బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీఎస్సీ(ఆనర్స్) సైకాలజీ కొత్త కోర్సులు చేర్చారు.

**కొత్తగా పీహెచ్‌డీ కోర్సులు**

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి పీహెచ్‌డీలో ఆరు ప్రోగ్రామ్‌లు ప్రవేశపెట్టారు. పొలిటికల్ సైన్సెస్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, అప్లైడ్ సైకాలజీ, తెలుగు, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలు చేపట్టనున్నారు.

**20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు**



ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సుల్లో 12 కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఆరు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టాం. ప్రస్తుతం 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో చదువుతున్నారు. జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్‌ను త్వరలో ప్రారంభించబోతున్నాం. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.ఏ. కోరి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

### వ్యక్తి హత్య


అంజినప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్: మతి స్థిమితం లేని వ్యక్తి చేతిలో ఓ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని బోయపేటకు చెందిన ఎరికల అంజినప్ప (64) ద్విచక్ర వాహనంపై పూజా సామగ్రిని తీసుకెళ్లి సమీప గ్రామాల్లో విక్రయించేవాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజులాగే మంగళవారం గుట్టూరు సమీప గ్రామాలలో విక్రయించి, సాయంత్రం గ్రామంలోని కొల్లాపురమ్మ ఆలయంలో బస చేశాడు. అదే సమయంలో అక్కడకు మునిమడుగు గ్రామానికి చెందిన బోయ గంగాధర్ చేరుకున్నాడు. కొంత కాలంగా మతిస్థిమితం లేక గ్రామాలలో తిరిగేవాడు. తన తండ్రి రామచంద్రతో గంగాధర్‌కు భూ వివాదం ఉంది. ఈ క్రమంలో ఒంటరిగా ఎవరిని చూసినా తనను హతమార్చేందుకే వచ్చారని భావించి గొడవ పడేవాడు. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలో బస చేసిన అంజినప్పను చూసి తనను హతమార్చడానికే వచ్చాడనే అనుమానంతో గంగాధర్ గొడవపడ్డాడు. ఎంత నచ్చచెప్పినా వినకుండా టవాలును అంజినప్ప మెడకు బిగించి ఆలయం నుంచి బయటకు ఈడ్చుకెళ్లాడు. కొట్టుకుంటూ 44వ జాతీయ రహదారిపైకి తీసుకెళ్లి అనంత టెక్ పరిశ్రమకు వెళ్లే మార్గంలో ఈద్గా వద్దకు చేరుకోగానే టవాల్‌తో గొంతు బిగించి హతమార్చాడు. ఘటనపై బుధవారం ఉదయం కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్


హాజరైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్సీ 12కి సంబంధించిన మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని ప్రభుత్వాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ అనంతపురం జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం బుధవారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 12వ పీఆర్సీలో భాగంగా మధ్యంతర భృతిని ప్రకటించి గత పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు వెంటనే చెల్లించేలా ఆర్థిక శాఖను ఆదేశించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు ఎంటీఎస్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి, పాఠశాలల సమాచారం పంపడానికి వీలుగా ఉన్నత పాఠశాలలకు, స్కూల్ కాంప్లెక్స్‌కు డిజిటల్ అసిస్టెంట్‌ను కేటాయించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపజేయాలన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయస్సు, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం చేయాలన్నారు. విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలవాలన్నారు.

సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జ్ సి.నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సూర్యుడు, కె.చంద్ర శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు గోవిందు, శివయ్య చారి, మాజీ అధ్యక్షులు రామన్న, గోవిందు, నారాయణస్వామి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ సురేష్ కుమార్, కృష్ణ మోహన్, ఫణి భూషణ్, మల్లికార్జున గౌడ్, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో ఖాద్రీశుడు

### ఖాద్రీశుడికి పూజలు

కదిరి టౌన్: ఏకాదశి పండుగ సందర్భంగా పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు ఉపవాసాలతో ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## కంచిసముద్రంలో ఇరువర్గాల ఘర్షణ


చికిత్స పొందుతున్న మనోహర్

రొద్దం: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో బుధవారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మనోహర్, సుమలతపై టీడీపీ కార్యకర్త రాజగోపాల్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు శోభ, రవీంద్ర, జయమ్మ, జయరాములు అక్కడకు చేరుకుని రాజగోపాల్‌తో కలసి దాడికి దిగారు. పరస్పర దాడుల్లో ఇరువర్గాల వారూ గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొందరిని అనంతపురానికి, మరికొందరిని హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, మనోహర్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే ఎస్ఐ తిరస్కరించారు. బాధితుడు స్వయంగా రావాలని సూచించినట్లు సమాచారం.

## గ్రామాల్లో పర్యటించిన స్పెయిన్ బృందం


బీజీ హళ్లిలో పర్యటిస్తున్న స్పెయిన్ దేశస్తులు

రొళ్ల: మండలంలోని జీజీ హట్టి, బీజీ హళ్లి, హెచ్‌టీ హళ్లి గ్రామాల్లో బుధవారం స్పెయిన్ బృందం సభ్యులు అనా, కరీల, రాకెల్ పర్యటించారు. జీజీ హట్టిలో యాదవుల ఆచారం ప్రకారం కాన్పు జరిగిన తర్వాత మూడు నెలల వరకూ ఊరి బయట చంటి బిడ్డతో కలసి ఉంటున్న బాలింత అనితను కలసి మాట్లాడారు. ఆమె ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. అనంతరం మహిళలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇక్కడి ఆచారాలు, అవలంభిస్తున్న విధానాలను ట్రాన్స్‌లేటర్ తులసి, ఏటీఎల్ ఓబులేసు తదితరులు స్పెయిన్ దేశస్తులకు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలని ఈ సందర్భంగా వారు సూచించారు. బాలికలకు పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి ఉన్నత చదువులు చెప్పించాలని సూచించారు. ఆర్డీటీ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బీజీ హళ్లిలో ఒంటరి మహిళ లక్ష్మమ్మకు ఆర్డీటీ ద్వారా ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసుకున్న కిరాణాషాపును పరిశీలించారు. అనంతరం హెచ్‌టీ హళ్లిలో రూ.4 లక్షల వ్యయంతో ఆర్డీటీ నిర్మించి ఇచ్చిన ఇంట్లో యజమాని అమ్మజక్కతో గృహ ప్రవేశం చేయించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓలు హనుమంతరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

# నేత్రపర్వం... అక్కమ్మ గార్ల ఉత్సవం


పోటీలలో పరిగెడుతున్న ఎడ్లబండి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి సమీపంలో దొడ్డిగుండ్లు గవిలో వెలసిన అక్కమ్మగార్ల జాతర బుధవారం అట్టహాసంగా ముగిసింది. మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో వేడుకలను గ్రామస్తులు నిర్వహిస్తూ వచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా ఏటా మూడు రోజుల పాటు గ్రామానికి చెందిన కాయల వంశీయులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముగింపు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక ఆర్ఎంపీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. చివరి రోజు ఎడ్లబండి పరుగు పందెం పోటీలు హోరాహోరీగా సాగాయి. జెండా ఊపి పోటీలను మాజీ సర్పంచ్ శ్రీరామ్‌నాయక్, కాయల రాము ప్రారంభించారు. మొదటి బహుమతిని నల్లగుట్టపల్లి రాము, రెండవ బహుమతిని కొత్తచెరువు కేశవ, మూడో బహుమతిని బుక్కపట్నం జంగం శ్రీనివాసులు దక్కించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అక్క మహాదేవతల విగ్రహాలు


నెమలి ఈకలతో నివేదన చేస్తున్న బాలురు



# 'హెల్'ఫోన్ డ్రైవింగ్

నగరంలో ద్విచక్ర వాహనదారులకు మాయదారి జబ్బు సోకింది. మొబైల్ ఫోన్ లేనిదే వాహనాలను నడపలేకపోతున్నారు. ఓ చేత్తో మొబైల్ ఫోన్ ఆపరేట్ చేస్తూనే రద్దీగా ఉండే రహదారులపై రయ్యిమంటూ దూసుకెళుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని అధికారులు ఎంత చెప్పినా.. ఈ జబ్బు వాహన చోదకులను వీడడం లేదు. తమకు విధించిన టార్గెట్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు నిబంధనల మేరకు వాహనాలను నడుపుతున్న వారికి సైతం గుట్టు చప్పుడు కాకుండా ఈ-చలాన్‌లు విధిస్తున్న పోలీసుల దృష్టి ఈ మాయదారి జబ్బు సోకి ఇతరులను ప్రమాదాలకు గురి చేస్తున్న వారిపై పడకపోవడం దురదృష్టకరం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


అసలే మైనర్ : నగర రహదారిపై సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ దూసుకెళుతున్న మైనర్

## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి రూ.50 వేల వితరణ

**అనంతపురం కల్చరల్:** హౌసింగ్ బోర్డులో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న నిత్యాన్నదానానికి శ్రీసాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ, నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల బుధవారం రూ.50 వేలు అందించారు. ఆలయంలో నిత్యాన్నదానం చేయాలని నిర్వాహకులు సంకల్పించగా... విషయం తెలుసుకున్న నిర్మల దంపతులు తొలి విడతగా అన్నదానానికి చేయూతనిచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ కేశవచంద్ర, బాబురావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దళితులకు రక్షణ కల్పించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు

**అనంతపురం టవర్‌క్లాక్:** దళితులకు రక్షణ కల్పించాలని మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షులు గంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కారంచేడులో అగ్రకులం వారి చేతుల్లో హత్యకు గురైన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితులపై దాడులు ఆగలేదన్నారు. కారంచేడులో అగ్రకులాలు పెత్తనం కోసం దళితుల కాలనీలోకి ప్రవేశించి ఊచకోత కోశారన్నారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాకే హరి, శ్రీనివాసులు, దామోదర్, కోడవండ్ల నరేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### షిరిడీలో అన్నదానానికి భిక్షాటన


నగరంలో భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

**అనంతపురం కల్చరల్:** షిరిడీ సాయి అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో భిక్షాటన చేశారు. షిరిడీ సాయినాథుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ భిక్ష సేకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకుని 14 ఏళ్లగా షిరిడీ క్షేత్రంలో దాదాపు 1.50 లక్షల మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. ఈసారి మరింత పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. గురు పౌర్ణమికి నాలుగు రోజుల ముందు నుంచి రోజూ షిరిడీ క్షేత్రంలో 80 వేలమందికి అన్నదానం చేస్తామన్నారు. అన్న సంతర్పణలో పాల్గొనడం ఆనందకరమన్నారు. ప్రత్యేక పూజల అనంతరం 12 టన్నుల కూరగాయలు, బియ్యం బస్తాలు లారీ ద్వారా షిరిడీ క్షేత్రానికి తరలించారు.

### ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

**చెన్నేకొత్తపల్లి:** ఆధార్‌కార్డును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 23న చెన్నేకొత్తపల్లి -1 , 24న న్యామద్దెల -1, 25న ప్యాదిండి, 26న మేడాపురం-1, 27న కనుముక్కల-1 సచివాలయాల్లో సిబ్బంది ఆధార్ అప్‌డేట్ చేస్తారన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 5 నుంచి 15 సంవత్సరాల్లోపు ఉన్న విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకునే విధంగా ఎంఈఓ అవగాహన కల్పించాలన్నారు.

### 'ఆ డాక్టర్లపై చర్యలు తీసుకోండి'

**అనంతపురం టవర్‌క్లాక్:** నగరంలోని వంశీ ఆస్పత్రి డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని దళిత దండు అధ్యక్షుడు కొడవండ్ల నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కల్లూరుకు చెందిన చిదంబరయ్య, వరలక్ష్మిలు వంశీ ఆస్పత్రిలో చేరారన్నారు. బాధితులకు ఆపరేషన్ అవసరం లేకపోయినా ఆరోగ్యశ్రీ కింద చేశారన్నారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స వికటించి బాధితులు శాశ్వతంగా అంధులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డాక్టర్లను నిలదీయగా స్పందించలేదన్నారు. కలెక్టర్, ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. త్వరలో అన్ని దళిత సంఘాలను కలుపుకుని బాధితులతో కలిసి ఆందోళనలు చేపడతామని, అప్పటికీ న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధితులు చిదంబరయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో జలధికి తరలివెళ్తున్న పీర్ల స్వాములు


కనగానపల్లిలో జలధికి తరలుతున్న పీర్ల స్వాములు


ప్రత్యేక అలంకరణలో సయ్యద్‌హజరత్ సయ్యద్ మస్తాన్ వలి పీర్ల స్వాములు

# మొహర్రం.. భక్తిభావం

**అనంతపురం కల్చరల్:** మొహర్రం సందర్భంగా నగరంలో భక్తిభావం వెల్లివిరిసింది. వాడవాడలా పీర్ల స్వాములు ప్రత్యేక పూజలందుకున్నారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 4, 5వ రోడ్ల వద్ద వెలసిన పీర్ల మకానాలు, తిలక్‌రోడ్, కమలానగర్, రామ్‌నగర్, రహమత్‌నగర్, రాణినగర్ ప్రాంతాలు పెద్ద సంఖ్యలో చక్కెర చదివింపుల కోసం తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారాయి. కసుమూరు ఖాలేషా మస్తాన్‌వలి హజరత్ మౌలాలి, హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి బాబా పీర్ల బ్రహ్మోత్సవాలు అందరిలో ఆనందోత్సాహాలను నింపాయి. భక్తిభావం మరింత పెంచుతూ పలు చోట్ల పానకాల జాతర జరిగింది. ఆసార్‌వీధి, రెండవరోడ్డు, తాడిపత్రి బస్టాండు తదితర చోట్ల వెలసిన దర్గాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మొహర్రంతో పెద్ద పీర్ల పండుగ తుది దశకు చేరుకుని మకానాల నుంచి పీర్లను జలధికి తీసుకెళ్లారు. తప్పెట మోతల హోరు నడుమ వివిధ రకాల పూలతో అలంకరించిన పీర్లను రాత్రి దాకా ఊరేగింపు నిర్వహించారు.

- నాల్గవరోడ్డులో హజరత్ సయ్యద్ మస్తాన్ వలీ పానకాల వేడుకల్లో మేయర్ వసీం ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. తీర్థప్రసాదాలందుకున్నారు. అందరితో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇషాక్, డివిజన్ కన్వీనర్ కిషోర్‌బాబు, వాసు, నవీన్, ఖాజా, గోపాల్, యూనిస్, నవాజ్, గంగాధర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు, తలుపూరు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం తెల్లవారుజామున పీర్లస్వాములను గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహించారు. స్వామివార్లను చూడటానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**కనగానపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. కనగానపల్లిలో దస్తగిరి, వన్నూరుస్వామి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన ఘట్టమైన జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు భారీ తరలివచ్చారు. పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి ఊరేగింపుతో జలధికి తరలించారు. తగరకుంట, యలకుంట్ల, నరసంపల్లి గ్రామాల్లో కూడా మొహర్రం వేడుకలు జరిగాయి.

**రాప్తాడు:** మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి, గంగలకుంట గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. ముఖ్య ఘట్టమైన జలధి ఉత్సవాన్ని హిందూ, ముస్లింలు కలసి నిర్వహించారు. తెల్లవారుజామున పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం పీర్ల దేవుళ్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఆత్మకూరులో జనసంద్రంగా మారిన ఓ వీధి


అనంతపురంలో చక్కెర చదివింపులు చేస్తున్న మహిళలు


పీర్లను దర్శించుకున్న మేయర్ వసీం


ప్రత్యేక పూజలు చేస్తున్న యువకులు


గంగలకుంట గ్రామంలో జలధికి వెళ్తున్న పీర్లు

## ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక నవోదయ కాలనీలో ఏకలవ్య జయంతి సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అనంతపురం నగరంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎరుకల కార్పొరేషన్‌కు నిధులు సమకూర్చి, ఎరుకల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షులు సాకే హరి, చిరంజీవి, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఏకలవ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**ఏకలవ్యుని జీవితం ఆదర్శం**

**అనంతపురం రూరల్:** ఏకలవ్యుని జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని ఎరుకుల సంఘం నాయకులు బీజేపీ వెంకటేష్, రాగిరి శ్రీనివాసులు అన్నారు. ఏకలవ్యుని జయంతి వేడుకలను బుధవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకుల సంఘం నాయకులు బీజేపీ వెంకటేష్, రాగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకలవ్యుని జీవితం నేటి సమాజానికి ఆదర్శమన్నారు. యువత ఏకలవ్య మహర్షిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. గురువులను, పెద్దలను గౌరవించడంతో పాటు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. అత్యంత వెనుకబడిన ఎస్టీలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ వెంకటరమణ, సూర్యనారాయణ, వడ్డే వెంకటేష్, అశోక్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఏకలవ్య జయంతి**

**చెన్నేకొత్తపల్లి:** మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో బుధవారం ఏకలవ్య జయంతిని ఎరుకల సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు.


ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

జిల్లా ఎరుకల సంఘం ఉపాధ్యక్షుడు ఎరుకల శంకర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏకలవ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరుకలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ఎరుకల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు, భవనానికి స్థలాన్ని కేటాయించాలన్నారు. ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎరుకల రుద్ర, ముసలయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

## జాషువా సాహిత్యానికి విస్తృత ప్రచారమే లక్ష్యం

**అనంతపురం కల్చరల్:** కులమతాలను నిరసించి సమాజంలో చైతన్యాన్ని రగిలించిన మహాకవి జాషువా సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించడమే లక్ష్యమని పలువురు వక్తలన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల పోస్టర్లను బుధవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాషువా సాహిత్య పీఠం నిర్వాహకులు నాగలింగయ్య, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న మాట్లాడుతూ ఈనెల 24న మహాకవి జాషువా జయంతి వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి జిల్లాలోని ప్రముఖులతో నివాళులర్పిస్తామన్నారు. 11 గంటలకు జాషువా సాహిత్యంపై ఆర్ట్స్ కళాశాలలో సదస్సు జరుగుతుందని, జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఆచార్య బాల సుబ్రమణ్యం, శ్యామసుందరశాస్త్రి వంటి ప్రముఖులు జాషువా సాహిత్య విశేషాలను విశ్లేషిస్తారన్నారు.


జాషువా జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కవులు

జాషువా సాహిత్యం ఈతరం వారికి పరిచయం చేయడానికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందిస్తామన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో విశాలాంధ్ర సిబ్బంది ప్రవీణ్, హరీష్, శ్రీనివాసులు, తదితరులున్నారు.

## కోచింగ్ క్యాంప్ ప్రారంభం

**అనంతపురం:** నగరంలో ఆర్డీటీ, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్ కోచింగ్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 29 వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ జిల్లా సంఘం అధ్యక్షుడు హబీబుల్లా, కార్యదర్శి కే. సరేంద్ర చౌదరి, ఏడీబీఏ సభ్యులు, క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి (కడప) కే. జగన్నాథ రెడ్డి. కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు, ఈగల స్పానిష్ బాస్కెట్‌బాల్ కోచ్‌లు, క్యూబా స్కెట్, యూతః మెటారో, కాలెల్లా కోచ్‌లు పాల్గొన్నారు.


కోచింగ్ క్యాంపులో పాల్గొన్న స్పానిష్ కోచ్‌లు

# ఘనంగా తొలి ఏకాదశి పూజలు


రాప్తాడు: అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి


పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండురంగడు


సామూహిక విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు


అలంకార సేవల్లో లక్ష్మీ చెన్నకేశవుడు

**అనంతపురం కల్చరల్:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విష్ణుసహస్ర నామ పారాయణతో ఆలయాలు మార్మోగాయి. బుధవారం తెల్లవారుజామున నుంచే నగరంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు, అలంకార సేవలు జరిగాయి. పాతూరులోని ప్రాచీన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దత్తాత్రేయస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారికి విశేష పుష్పాలంకార సేవలు జరిగాయి. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం భక్తిశ్రద్ధలతో సాగింది. రామ్‌నగర్‌లోని భవసార క్షత్రియ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరి దేవతామూర్తులను దర్శించుకున్నారు. నిజపాద స్పర్శ దర్శనంలో స్వయంగా మూలవిరాట్టును తాకి పూజలు నిర్వహించారు. ఇస్కాన్ గోశాల, వేణుగోపాల స్వామి ఆలయం, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

**రాప్తాడు:** తొలి ఏకాదశిని రాప్తాడు మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి, వినాయకుడికి అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. రాప్తాడులో పండమేటి వేంకటరమణ స్వామి, ఆంజనేయస్వామి, మారెమ్మ, ముత్యాలమ్మ, యర్రగుంట, పుల్లలరేవు గ్రామాల్లో చెన్నకేశవస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి, ప్రసన్నాయపల్లిలో పెద్దమ్మ, చిన్మయనగర్‌లో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, శివాలయం, హంపాపురంలో 39 అడుగుల అభయాంజనేయస్వామి, మరూరులో చిన్నకదిరయ్య స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన కురుబ కులస్తులు, కపాడం వంశస్తులు మండలంలోని పాలచెర్లలో పాలచెర్లప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. అలాగే రాప్తాడు, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.

## రైతు మెడపై వేలాడుతున్న కరువు కత్తి

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ

**రాప్తాడురూరల్:** రాష్ట్రంలోని రైతు మెడపై కరువు కత్తి వేలాడుతోందని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుకు, కరువుకు విడదీయరాని బంధం (కరువు బాబు కవల పిల్లలు) అనే నానుడి ప్రచారంలో ఉందని పేర్కొన్నారు. నేడు మళ్లీ కరువు ఘంటికలు మోగుతున్నాయన్నారు. దీంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ప్రభుత్వ సాయం అందక, కొత్త అప్పు పుట్టక, ఆకాశం వైపు అమాయకంగా చూస్తున్నారన్నారు. ఖరీఫ్ వెళ్లిపోతున్నా పదును వర్షం లేదన్నారు. పెట్టుబడి ఖర్చులకు డబ్బులు లేవన్నారు. చేసిన అప్పు తీరక కొత్త అప్పు పుట్టక రైతుల ఆత్మహత్యలు, హాహాకారాలు, ఆర్తనాదాలు ఇవన్నీ ప్రభుత్వాల ముందు అరణ్య రోదనలేనన్నారు. ఎన్నికల ముందు రైతే రాజు తర్వాత బిచ్చగాడు అని వాపోయారు. అప్పట్లో రైతు భరోసా (పెట్టుబడి సాయం) రూ. 13 వేల నుంచి 20 వేలకు పెంచి సకాలంలో చెల్లిస్తామన్నారని, నేడు ఖరీఫ్ దాటిపోతున్నా చలనం లేదన్నారు. మూలిగే నక్కపై తాటికాయ వేసిన చందంగా గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా కూడా ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా సాయం, ఉచిత పంటల బీమాను అన్ని పంటలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.